# బొంగరం

—ఎస్. జయలక్ష్మి

> తప్పనంతసేపూ తిరిగే బొంగరం లాంటిది బ్రతుకు. తిప్పేవా డెవడు? తిరిగే దేమిటి? అంతా మిథ్య అని సరిపెట్టుకొనడానికి ప్రయత్నిస్తారు పలువురు. నిరాసక్తత పెంచుకొంటారు. బొంగరమే బ్రతుకు అయిన పసిపిల్లలు మాత్రం దానితో బాటుగా పరిభ్రమిస్తూ, ఆనందిస్తూ, అది ఒక్కటే నిజమని నమ్ముతారు. ఏది భ్రమో ఎవరు చెప్పగలరు?

గిర్రున తిరుగుతూంది బొంగరం.

పిల్లలందరూ ఆనందంతో చప్పట్లు చరుస్తూ చూస్తున్నారు. విజయాన్ని సాధించిన రాంబాబు కపోలాలు పైనుంచి లేత సూర్యుని కిరణాలు పడి మరింత అరుణిమను సంతరించుకుంటున్నాయి.

"చూడండ్రా! ఎంత గుక్కపట్టి తిరుగుతోందో!" గర్వంతో అన్నాడు రాంబాబు.

పిల్లలందరూ ఉత్సాహంతో చప్పట్లు కొడుతూ గంతులు వేస్తున్నారు.

"ఇంతేనా! ఈమాత్రం ఎవడైనా వేస్తాడు."

వెనకనించి వినిపించిన ఈ మాటలకి కళ్ళన్నీ వెనక్కి తిరిగాయి.

సీనుగాడు మళ్ళీ అన్నాడు: "అవున్రా, ఏ ముంది ఇందులో గొప్ప? ఈ మాత్రం గుడ్డిముండ కూడా వేస్తుంది."

ఒక్కసారి నిశ్శబ్దం ఆవరించింది. రాంబాబు ముందుకు వచ్చి బొంగరం అందిస్తూ-"ఏదీ, వెయ్యరా—చూద్దాం" అన్నాడు.

అందరూ సీనుగాడి వంక చూశారు.

సీను బొంగరం చుట్టూ తాడు చుట్టి, బలంగా నేలమీదికి విసిరాడు. అది ఒక్క చుట్టన్నా తిరగకుండానే నేలమీద పడిపోయింది. అంతే! కేకలూ, చప్పట్లూ మిన్నుముట్టాయి. రాంబాబు ఏమీ మాట్లాడకుండా సీను వంక చూశాడు.

అందరి కళ్ళూ సీనుమీదే ఉన్నాయి.

అరుగు మీద నుంచి ఇదంతా గమనిస్తున్న విమల ఒక్కసారిగా, "రాంబాబూ, తెల్లారిందో లేదో, మళ్ళీ మొదలెట్టావ్! ఏం పిల్లవాడివిరా—నాయనా, ఇరవై నాలుగ్గంటలూ బొంగరం ధ్యాస తప్పితే మరోటి లేదు. చెప్పి చెప్పి నాకు విసుగొస్తోంది" అంది.

పిల్లలందరూ మెల్లిగా ఎవరి దారి వారు చూసుకున్నారు. రాంబాబు బొంగరమూ, తాడూ పుచ్చుకుని ఇంట్లోకి నడిచాడు.

బుద్ధిగా పుస్తకాలు ముందర వేసుకుని కూచున్న రాంబాబుని చూసి తనలో తనే నవ్వుకుంది విమల. రాంబాబు చిత్రమైన వాడు. ఉదయం లేచిన దగ్గరనుంచీ రాత్రి పడుకునేదాకా బొంగరం మీదే ధ్యాస వాడికి.

'రోజల్లా బొంగరం తోనే కూచోటానికి విసుగుండదు కావును వాడికి!' — విమల అనేకసార్లు అనుకుంది. అయినా రాంబాబులో ఓ సుగుణం కూడా ఉంది. ఒక్క కేక పెడితే చాలు, ఇంట్లోకి వచ్చి పుస్తకాల ముందు కూర్చుంటాడు. కాని, ఓ పది నిమిషాలవగానే మళ్ళీ బొంగరం పిలుస్తుంది.

'అవటం తండ్రి పోలికే అయినా, వాడికీ, ఆయనకీ నడవడిలో ఎంత తేడా ఉంది!' భర్త ఆలోచన రాగానే విమల కళ్లలో నీళ్ళు నిలిచాయి. ఆయన వెళ్ళి ఏడాది కావస్తూంది. ఎప్పుడు వస్తారో ఏమిటో! బుద్ధి పుడితే ఉత్తరం రాస్తారు. లేకపోతే అదీ లేదు. విమల మనస్సు గతాన్ని నెమరువెయ్యటం మొదలు పెట్టింది.

పదేళ్ళ క్రితం తనకు ఆయనతో పెళ్లి జరుగుతుందని వినగానే ఎంతో పొంగిపోయింది. నిజానికి అది తను ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యఫలం అనుకుంది. లేకపోతే, అతి పేద కుటుంబంలో పుట్టిన తనను చేసుకోవాలని ఆ శ్రీమంతుడికి ఎందు కనిపించాలి? తననే చేసుకోవటానికి తనలో ప్రత్యేకత ఏ ముంది గనక!

విమల అనాకారి కాకపోయినా, చెప్పుకోదగ్గ రూపసి కాదు. ఇక విద్య సంగతా అంటే, కనీసం తను గ్రాడ్యుయేటన్నా కాదు. తండ్రి పోవటం వల్ల స్కూల్‌ఫైనల్ దాటి చదువు సాగలేదు తనకు. అటువంటి స్థితిలో ఒక లక్షాధికారి తనకు తానై వచ్చి పెళ్ళాడతాడని కలలో కూడా అనుకోలేదు. అసలు ఇప్పుడు తలుచుకుంటే తన పెళ్లి వ్యవహార మంతా ఒక కలే అనిపిస్తుంది.

పెళ్ళయిన కొత్తలో, జీవితం తిరిగిన మలుపుకు తను ఉక్కిరి బిక్కిరి అయింది. ఆయన కూడా తన నెంతో ప్రేమతో చూసేవారు. సహజంగా డబ్బున్న వాళ్ళకుండే వ్యసనాల్లో ఏ ఒకటీ ఆయనకు లేదని తెలుసుకున్నప్పుడు విమల మనస్సులో సంతోషం మేడలు కట్టింది.

కాని వెంటనే అవి పేకమేడలై కూలి పోయాయి. ఇంత చిన్న వయస్సులోనే ఆయనకు జీవితం మీద ఇష్టంలేకుండా పోయింది. ఈ సృష్టికంతకీ కారణాలు అన్వేషిస్తూ తిరగకపోతే, హాయిగా జీవితాన్ననుభవిస్తూ గడపవచ్చు కదా! ఆయనలో ఈ తాత్త్వికచింతన ఎక్కువవుతూందనే విషయం తను పెళ్లయిన వెంటనే గుర్తించింది. ఎన్నో విధాలుగా ఆయన్ని ఆకర్షించి ఇంట్లో కట్టి పడెయ్యాలని తను శాయశక్తులా ప్రయత్నించింది. కాని, ఫలితం శూన్యం. తన పదేళ్ళ వైవాహిక జీవితంలోనూ పట్టుమని ఆయన రెండేళ్లయినా ఇంటి దగ్గిర గడపలేదు.

"నేను జిప్సీలలో పుట్టవలసిన వాణ్ణి, విమలా! పొరపాటున భగవంతుడిక్కడ పడేశాడు." ఆయన అప్పుడప్పుడనేవారు.

ఇంతకంటె వ్యసనపరుడై ఇంటి దగ్గిరే పడిఉంటే బాగుండే దనుకునేది తను. కాని, ఏం లాభం? తన ఆలోచనలే తనను వెక్కిరిస్తూ మిగిలిపోయేవి. మొదట్లో సంతానం కలిగితే ఆయన ఎక్కడికీ కదలరని అనుకునేది. కాని, రాంబాబు పుట్టాక ఆ ఆలోచన నిరాధారమని తేలిపోయింది. నిజానికి ఈ ఒక్క విషయం తప్పిస్తే తన కే లోటూ లేదు. చక్కటి ఇల్లూ, కావలిసినంత సంపదా.

ఒకసారి ఆయన తిరిగి తిరిగి వచ్చి ఒక నెలపాటు ఉండిపోయారు. అది వేసవికాలం. రాత్రి డాబామీద పడుకున్నారు. కర్పూరపు ధూళి ఆకాశాన్ని కప్పినట్లుగా వెన్నెల. ఒకదానొకటి తరుముకుంటూ చంద్రుణ్ణి కప్పుతున్నాయి మేఘాలు. ఆకాశం వంక చూస్తూ అంది తను: "చూడండి, ఎంత అందంగా ఉందో వెన్నెల! ఈ జీవితాన్ని కాదని ఎందుకు వెళ్లిపోతారు?"

పైకి చూస్తూ ఆయన నవ్వి అన్నారు: "చూడు, విమలా! చంద్రుడు ఎందు కలా నిలకడ లేకుండా పరుగెడుతాడు?"

తను వెంటనే సమాధానం చెప్పింది. "చంద్రు డెక్కడికీ పరుగెట్టటం లేదు. పరుగెట్టేవి మేఘాలు. ఇదంతా మన భ్రాంతి."

"అవును, విమలా, ఇదంతా భ్రాంతి... మిథ్య." అంతే. ఈ మాట లని ఆయన గంభీరంగా ఉండిపోయారు.

"అమ్మగారూ! మూరమ్మ మళ్ళీ వచ్చిందమ్మా!" పనిమనిషి మాటలతో ఈ లోకంలో పడింది విమల.

"బయట పంపు దగ్గిర అంతా కాట్లాడుకుంటున్నారట. ఒక్క బిందె పట్టుకోనిమ్మని బతిమాలుతోంది."

పనిమనిషి మాటల్లో, "పోనీ, పట్టుకోనివ్వండి' అన్న భావం ధ్వనించింది విమలకి. ఇదివర కెన్నోసార్లిలా జరిగింది. తను వద్దనటం, మూరమ్మ వెళ్లిపోవటం. మళ్ళీ వచ్చి ప్రాధేయపడటం. తను సరేననటం. ఈ సంగతి తెలిసిన పనిమనిషి విమల సమాధానం కోసం నిరీక్షిస్తూ నుంచుంది. "సరేలే. ఈవేళ్టికి పట్టుకోనీ."

పనిమనిషి సంతోషంతో వెళ్ళిపోయింది. ఆలోచిస్తూనే విమల మళ్ళీ వీథిలోకి వచ్చింది. బయట కోలాహలం. ఎప్పుడు చేరారో రామూ, కిష్టప్పా, సీనూ, రాంబాబూ కేరింతలుకొడుతూ చూస్తున్నారు. బొంగరం మళ్ళీ తిరగటం ప్రారంభించింది.

విమల వీథిలోకి చూసింది. దూరంగా ఏదో రణగొణ ధ్వని. సన్యాసమ్మ మళ్ళీ పుణుకుల దుకాణం తెరిచింది. పోలీస్ కానిస్టేబుల్ కాంతయ్యకి కాఫీకి డబ్బులు లేనప్పుడల్లా సన్యాసమ్మ జ్ఞాపకం వస్తుంది.

"ఏయ్, మామ్మా, ఈ దుకాణం ఇక్కణ్ణుంచి ఎత్తెయ్యాలి. ఇన్‌స్పెక్టరుగారు ఇంకో గంటలో వస్తారు. అయినా, నీ కెన్నిసార్లు చెప్పాలి. ఇలా రోడ్డుమీద దుకాణం తెరవటానికి రూల్సు ఒప్పుకోవనీ?"

కాంతయ్య దబాయిస్తాడు. సన్యాసమ్మ నవ్వుతూ కాంతయ్య చెయ్యి తడి చేస్తుంది. తాత్కాలికంగా కాంతయ్య రూల్సు మరిచిపోతాడు. ఇన్‌స్పెక్టరు రూటు మార్చుకుంటాడు.

"ఈవేళ పొద్దుట్నించీ ఒకటే ఆలోచనలు. ఒక్క పనీ తెమలటం లేదు' అనుకుంటూ ఇంట్లోకి దారి తీసిన విమలకు ఎదురుగా గోడమీద తమ పెళ్లి ఫోటో కనిపించింది. అది చూస్తూంటే ఆమెకు కళ్లలో నీళ్ళు తిరిగాయి. ఏమైనా ఇలా ఆలోచిస్తూ మనస్సు పాడుచేసుకుంటే తనతోబాటు రాంబాబు భవిష్యత్తు కూడా దెబ్బ తింటుంది. ఇంక ఈ ఆలోచనలు కట్టిపెట్టాలి. అందని వాటికోసం ఆశలు పెంచుకుంటే బాధలు తప్పవు. అసలు ఆయన రాకకోసం వెయ్యికళ్లతో ఎదురు చూడబట్టిగదా, ఆయన వెళ్లిపోతే తనకి బాధ. ఆయనకు లేని బాధ తన కెందుకు కలగాలి? ఆయన వచ్చినందుకుసంతోషం, వెళ్లిపోతే విచారం లేకుండా నిర్లిప్తతతో తన కర్తవ్యం తాను నిర్వహిస్తే తనకు



ఇంత బాధ ఉండదు. అవును! తామరాకు మీది నీటి బొట్టులా ఉండటం అలవాటు చేసుకోవాలి. భగవద్గీతలో కృష్ణుడు చెప్పిన స్థితప్రజ్ఞుడి లక్షణాలు — తనెప్పుడో చదివినవి— విమలకు జ్ఞాపకం వచ్చాయి. ఒక నిర్ణయానికి రావటంతో ఆమె మనస్సు తేలికపడింది. మెల్లిగా అడుగులు వేస్తూ దొడ్లోకి వచ్చింది. "ఒక్క బిందె, అమ్మగారూ!— ఒక్కటంటే ఒక్కటి. వేసంకాలం. గొంతు ఎండుకుపోయి పిల్లలు గోలపెడుతున్నారు." ఎదురుగా దీనంగా యాచిస్తూ నుంచుంది మారమ్మ.

"లాభంలేదు, మారమ్మా. నీళ్లన్నీ ఇచ్చినా నీ కరువు తీరదు. బిందె కాదు కదా, ఒక్క గ్లాసెడు నీళ్లు కూడా పట్టుకోడానికి వీల్లేదు." గట్టిగా సమాధానం చెప్పింది విమల. విమల మనస్తత్వం తెలిసిన మారమ్మ అక్కణ్ణుంచి కదల్లేదు. "అమ్మగారూ!... అమ్మగారూ!" దూకుడుగా వగరుస్తూ వచ్చి అంది పనిమనిషి: "అయ్యగారొస్తున్నారమ్మా. నిజం. వీధి మధ్య కొచ్చేశారు. ఇంకో నిమిషంలో ఇక్కడుంటారు.'

విమల ఒక్కసారి నిర్ఘాంతపోయింది. ఆమె మనస్సులో ఆనందం చెలియలికట్ట దాటిపోయింది. అమాంతం లేచి "సరేలే, మారమ్మని ఈ ఒక్క బిందే పట్టుకోనీ!" అంటూ చీరచెంగుతో కళ్లద్దుకుని ఒక్క ఉదుటున వీధిలోకి వచ్చింది.

ఇంటి ముందు చేరిన పిల్లలు ఈలలూ, కేకలూ వేస్తూ ఎప్పుడూ చూస్తున్నదే అయినా, ఎంతో ఆనందంతో చూస్తున్నారు, ఆ దృశ్యం. రాంబాబు ముఖంలో అమాయకత్వంతో కూడిన ఆనందం పరవళ్లు తొక్కుతూంది. ఇవేమీ ఎరగని బొంగరం తన చుట్టూ తాను తిరుగుతూనే ఉంది. ★